
# సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



### వర్షాలు కురిసి..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. 10లో▸




### 108 సిబ్బందికి అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బంది నగరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు. 10లో▸



### నిల్వ సిలిండర్ల పట్టివేత

గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న కేంద్రంపై పోలీసులు దాడులు నిర్వహించారు. 10లో▸

## న్యూస్‌రీల్

### రికార్డుల ప్రకారం మొక్కలు నాటాలి



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

కొందుర్గు: ఉపాధిహామీ పథకంలో భాగంగా నాటిన మొక్కలు చాలా వరకు తక్కువగా ఉన్నాయని, రికార్డుల ప్రకారం విధిగా నాటించాలని డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశించారు. మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులకు సంబంధించి 2024 –25లో వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ నరేందర్ ఆధ్వర్యంలో డీఆర్‌పీలు వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిపనులు, పనుల్లో జరిగిన అవకతవకలను చదివి వినిపించారు. చాలా వరకు ఎంబీలు, మస్టర్లలో కూలీల సంతకాలు సరిగ్గా లేకపోవడంపై డీఆర్‌డీఓ సంబంధిత కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, సునీత, జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీడీ శరణ్ గౌతమ్, ఎంపీడీఓ అనురాధ, సూపరింటెండెంట్ గణపతి, ఏపీఓ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో చెత్తా చెదారం శుభ్రం చేస్తూ సేవలందిస్తున్న కార్మికులకు నెలనెలా వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సబ్బులు, నూనె, బూట్లు అందజేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేదంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఎంపీఓ హన్మంతురెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు వీరేష్, రమేష్, రాము, యాదగిరి, తిరుమలేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### హైరానా వద్దు.. అది హైనా



వెంచర్ పరిసరాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ బాలాజీ టౌన్ షిప్, సిరిసంపద వెంచర్ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించిందనే పుకార్లతో గురువారం స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు రవీందర్, అబ్దుల్ అజీజ్, బీట్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎల్కిచర్ల ఫారెస్టు అధికారి రవీందర్‌రెడ్డి, ఆమనగల్లు ఫారెస్టు అధికారి రాఘవేందర్ బాలాజీటౌన్‌షిప్, సిరిసంపద వెంచర్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో జంతువుల, అడవి పిల్లుల పాదాల జాడలను పరిశీలించారు. హైనాకు సంబంధించిన పాదాలుగా నిర్ధారించారు. భయపడాల్సిన పనిలేదని, చిరుత సంచరించిన జాడ ఎక్కడా కనిపించలేదని తెలిపారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# జోరు వాన

## ఉప్పొంగిన ఈసీ, మూసీ వాగులు

- యాచారంలో అత్యధికంగా 17.95 సెంటీమీర్ల వర్షపాతం నమోదు
- మళ్లీ తెరుచుకున్న జంటజలాశయాల గేట్లు
- హైదరాబాద్–విజయవాడ రహదారిపైకి భారీగా వరద నీరు
- వాహనదారుల ఇబ్బందులు



యాచారంలో కురుస్తున్న వర్షం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వర్షం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం దంచికొట్టింది. ఉదయం ప్రశాంతంగా, ఆహ్లాదంగా కన్పించిన వాతావరణం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. హయత్‌నగర్ వద్ద ఉన్న హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి పైకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రోడ్డుపై నాలుగు అడుగుల ఎత్తు మేర వరద నీరు వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, బీఎన్‌రెడ్డి, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, యాచారం, మాల్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్, కందుకూరు, మహేశ్వరం, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. యాచారంలో అత్యధికంగా 17.95 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హయత్‌నగర్‌లో 11.2 సెంటీమీర్ల వర్షపాతం కురిసింది.

### మళ్లీ తెరుచుకున్న గేట్లు

జంట జలాశయాల ఎగువ ప్రాంతంలోని ఈసీ, మూసీ వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో హిమాయత్‌సాగర్ రెండు గేట్లను నాలుగు ఫీట్ల ఎత్తు, ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను రెండు ఫీట్ల చొప్పున పైకి ఎత్తి..వచ్చిన వరదను వచ్చినట్లే కిందికి వదులుతున్నారు. యాచారం మండలం గున్‌గల్, మల్కీజ్‌గూడ, నల్లవెల్లి, మాల్, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి తదితర ప్రాంతాల్లో గంటకుపైగా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఈ వర్షంతో మెట్ట పంటలకు జీవం పోసినట్లయింది. 15 రోజుల విరామం తర్వాత వర్షం కురియడంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జంటజలాశయాలతో పాటు జిల్లాలోని పలు చెరువులు, కుంటలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శిఖం భూములు నీటమునిగి, పంటలు దెబ్బతింటున్నాయి. మరోవైపు ఏకధాటి వర్షాలు, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక మంది దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్నారు.

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

చేవెళ్ల: కేంద్రం ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, తంగడపల్లిలో రూ.9 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీలకు పైసా విడుదల చేయకుండా పాలనను అస్తవ్యస్తంగా మారుస్తోందని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు పదేళ్లుగా కేంద్రం అందించే నిధులే దిక్కవుతున్నాయని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. మరిన్ని నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఎ.అనంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, శర్వలింగం తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

# అక్టోబర్ 12 నుంచి పల్స్‌పోలియో

**జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు**

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఐదేళ్లలోపు ఉన్న ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఈ మేరకు గురువారం శివరాంపల్లిలోని జిల్లా కార్యాలయంలో సంబంధిత వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 12న పోలియో బూత్‌ల్లో చుక్కలు వేస్తారని, 13 నుంచి 15వ తేదీ వరకు నేరుగా ఇళ్లలోకి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందిని, ఆరోగ్య కార్యకర్తలను, ఆశ కార్యకర్తలను, మహిళా గ్రూపులను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఓ డాక్టర్ మురారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శిభహయత్, జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ విజయ పూర్ణిమ, డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సుధ, ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

# చర్యలుంటాయా..?

- భూదాన్ భూములకు ఫార్మా పరిహారం
- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొనసాగిన విచారణ
- నివేదిక సర్కార్‌కు అందజేసిన అధికారులు
- ఏం చేస్తారోనేదానిపై సర్వత్రా చర్చ



తాడిపర్తి సర్వేనంబర్ 104లోని భూదాన్ భూమి

యాచారం: తాడిపర్తి భూదాన్ భూముల వ్యవహారంపై రకరకాల చర్చ జరుగుతోంది. ఈ భూములకు అక్రమంగా ఫార్మా పరిహారం ఇవ్వడం.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడం.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి విచారణ జరపడం.. పూర్తి స్థాయి నివేదికను సర్కార్‌కు అప్పగించడం పూర్తయింది. ఈ నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

**పరిహారం రికవరీ చేస్తారా..?**

తాడిపర్తిలో బొక్క సీతారెడ్డి కుటుంబ సభ్యులు 1954లోనే సర్వేనంబర్ 104లోని 250 ఎకరాలను సర్వోదయ భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేశారు. దానం చేసిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని రైతులు అప్పట్లోనే అధికారులకు విన్నవించారు. అధికారుల నిర్లక్ష్యంతో తర్వాత కొందరు రైతులు కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించి తమ పేరిట పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు. 2018లో ఫార్మాసిటీకి ఆ భూమిని తీసుకుంటున్నట్లు నోటిఫికేషన్ ప్రకటించారు. తర్వాత పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన 86 మంది రైతులు 190 ఎకరాలకుపైగా ఫార్మాసిటీకి ఇచ్చి దాదాపు రూ.27 కోట్లకు పైగా పరిహారం పొందారు. తీవ్ర ఆందోళనల నేపథ్యంలో మీరాఖాన్‌పేట టీజీఐఐసీ వెంచర్‌లో ఎకరాకు 121 గజాల చొప్పున ఇచ్చే ప్లాట్ల సర్టిఫికెట్లను నిలిపేశారు. ప్రస్తుతం అక్రమాల వ్యవహారం సీఎం దృష్టికి వెళ్లడంతో పరిహారం రికవరీ చేస్తారా.. లేదా అనే సందేహం నెలకొంది.

**అధికారులపై చర్యలుండేనా..?**

భూదాన్ భూములకు సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వొద్దని హైకోర్టు, మానవ హక్కుల కమిషన్ హెచ్చరించినా అధికారులు లెక్కచేయలేదు. 2020–2023 మధ్యనే పరిహారం ఫైళ్లు చకచకా కదిలాయి. ఓ ఆర్డీఓ చక్రం తిప్పి రూ.కోట్లాది పరిహారాన్ని అప్పనంగా అందజేశారు. ఈ వ్యవహారంలో సదరు ఆర్డీఓతో పాటు యాచారం తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ, సర్వే అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా అధికారుల విచారణలో భూదాన్ భూములకు పరిహారం ఇచ్చిన అప్పటి ఆర్డీఓ, ఇతర రెవెన్యూ, సర్వే శాఖ అధికారుల పేర్లతో నివేదికను సర్కార్‌కు అందజేసినట్లు సమాచారం.

**సర్కార్‌కు నివేదిక అందజేశాం**



భూదాన్ భూములకు సంబంధించి ఫార్మా పరిహారం అందజేసిన విషయమై పూర్తి స్థాయి విచారణ నివేదికను సర్కార్‌కు అందజేశాం. పరిహారం రికవరీ చేస్తారా.. అప్పటి అధికారులపై చర్యలు ఉంటాయా అనేది సర్కార్ పరిధిలో ఉంది.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

# యూరియా అవస్థలు



మేకగూడలో యూరియా కోసం రైతుల క్యూ

నందిగామ: యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగిన ఘటన మండల పరిధిలోని చేగూరు పీఏసీఎస్‌లో చోటుచేసుకుంది. చేగూరు పీఏసీఎస్‌కు గురువారం 250 బస్తాల యూరియా వచ్చింది. రైతులకు ఏ మాత్రం సరిపోక పోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు, ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పి పంపించారు. మేకగూడలోని పీఏసీఎస్‌కి 450 బ్యాగులు రాగా రైతులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అందరికీ అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

**గంటల తరబడి క్యూ**

ఇబ్రహీంపట్నం: శేరిగూడలోని ఉప్పరిగూడ పీఏసీఎస్‌కు గురువారం 20 టన్నుల యూరియా వచ్చింది. వందలాది మంది రైతులు క్యూ లైన్‌లో నిలుచున్నారు. సీఐ మహేందర్‌రెడ్డి వాటర్ బాటిల్స్ తెప్పించి క్యూలైన్‌లో ఉన్న వారికి అందజేశారు. రెండు గంటల్లోనే వచ్చిన స్టాక్ అయిపోయింది. అందని వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు.



శేరిగూడలోని ఉప్పరిగూడ పీఏసీఎస్ వద్ద క్యూ

**పోలీసు భద్రత మధ్య పంపిణీ**

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘానికి గురువారం 225 యూరియా బస్తాలు వచ్చాయి. తోపులాటలు జరుగుతాయన్న ఉద్దేశంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల భద్రత మధ్య బస్తాలను గోదాంలోకి దింపారు. అనంతరం మండల వ్యవసాయశాఖ అధికారి పల్లవి, సహకార సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ రైతులకు అందజేశారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**మాజీ మంత్రి సబితారెడ్డి**



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

షాబాద్: యూరియా పంపిణీలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియా సరఫరాపై ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలు కనిపించినప్పుడు నా అక్కాచెల్లెళ్లను లక్షాధికారులను చేస్తానని మాటలు చెప్పడం తప్ప ఒక్క హామీ అమలు చేసింది లేదని దుయ్యబట్టారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రెండేళ్లుగా ఇచ్చిన హామీలు పక్కన పెట్టి రకరకాల సమస్యలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులు, మహిళలు ఎలా శాపనార్థాలు పెడుతున్నారో చూస్తున్నామన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గు చేటన్నారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాష్‌రెడ్డి, నాయకులు కౌశిక్‌రెడ్డి, దేశమల్ల ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, కార్యదర్శి శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛను హరించడమే..

## సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

- ఏపీ పోలీసుల కేసులపై ముక్తకంఠంతో ఖండన
- ఎడిటర్, పాత్రికేయులకు వెల్లువెత్తుతున్న సంఘీభావం




సాక్షి, రంగారెడ్డిజిల్లా: పత్రికా స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరును ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరు పత్రికల గొంతునొక్కడమేనని అభిప్రాయపడ్డారు. సాక్షి దిన పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, బ్యూరో ఇన్‌ఛార్జి, రిపోర్టర్లపై ఏపీ ప్రభుత్వ ప్రోద్బలంతో అక్కడి పోలీసులు కేసులు పెట్టి ఆఫీసుకు వచ్చి నోటీసులు అందజేయడంపై వారు మండిపడ్డారు. పత్రికలో వచ్చిన కథనాలపై అభ్యంతరాలుంటే ఖండించడం, వివరణ ఇవ్వడం చేయాలి గానీ ఏకంగా కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

### కేసుల నమోదు హేయనీయం



సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం హేయనీయం. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై అందరికీ గౌరవం ఉండాలి. అది లేనప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడిగానే పరిగణిస్తున్నాం.

– వీర్లపల్లిశంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

### కక్షపూరిత చర్యలు తగవు



పత్రికా స్వేచ్ఛను హరించాలని చూస్తే సహించేదిలేదు. ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి, జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం. పత్రికాస్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించేలా కక్షపూరితంగా వ్యవహరించడం తగదు.

– పగడాల యాదయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

### సమాజం హర్షించదు



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం సరైంది కాదు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తప్పులను ఎత్తి చూపుతున్న జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రచురించిన వార్తపై ఏదైనా అభ్యంతరం ఉంటే ఖండించడం, వివరణ ఇవ్వడం చేయాలి కానీ రాసిన విలేకరులపై కేసులు పెట్టడం సరి కాదు. పత్రికా స్వేచ్ఛను హరించొద్దు. ఇలాంటి చర్యలను సమాజం హర్షించదు.

– సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం

### జర్నలిస్టులపై కేసులు దారుణం



పత్రికా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని హరించడమే. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసి పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులపై కేసులు పెట్టడం దారుణం. అధికారం చేతిలో ఉంది కదా అని విర్రవిగితే ఎంతటి వారికి అయినా పతనం తప్పదు. నియంతలా వ్యవహరించిన ఎంతో మంది కాల గర్భంలో కలిసిపోయారు.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

### ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం



రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే. ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం కలిగించడమే. విలేకరుల సమావేశంలో ఒక వ్యక్తి పేర్కొన్న అంశాలను ప్రచురిస్తే కేసులు పెట్టడం సరైంది కాదు. పత్రికాస్వేచ్ఛ విషయంలో సమాజంలోని అన్ని వర్గాలు గౌరవ దృక్పథం కలిగి ఉండాలి. ప్రెస్‌మీటర్ వార్తలను ప్రచురించిన సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకునే వరకు వెళ్లడం పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేయడం లాంటిదే.

– మైల సైదులు, జిల్లా కార్యదర్శి, టీడబ్ల్యూజేఎఫ్

# ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

**ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్**


మాట్లాడుతున్న ప్రణయ్ తదితరులు

**మహేశ్వరం:** మహేశ్వరం మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల జీతాల్లో అవినీతికి పాల్పడిన ప్రిన్సిపాల్ గోపిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద గతేడాది ఆగస్టు నుంచి నెలకు రూ.10 వేల చొప్పున మరుగుదొడ్ల శుభ్రం చేసేవారు(స్కావెంజర్ల) జీతాల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ప్రిన్సిపాల్ ఇద్దరి స్కావెంజర్లను నియమించి వారికి నెలకు రూ.10 వేల చొప్పున జీతం ఇవ్వకుండా, కేవలం రూ.7వేల ఇచ్చారని ఆరోపించారు. స్కావెంజర్ల జీతాలలో ప్రిన్సిపాల్ చేతివాతం ప్రదర్శించి అవినీతి చేయడం సరికాదన్నారు. వెంటనే ప్రిన్సిపాల్ గోపిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధు, తరుణ్, రాహుల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిల్వ ఉంచిన 34 సిలిండర్ల పట్టివేత


పట్టుబడిన సిలిండర్లు

**మహేశ్వరం:** స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తున్న కేంద్రంపై మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడలోని కావ్య ప్లాస్టిక్, స్టీల్ హౌస్‌లో పోతోడు గోవర్ధన్, మామిడిపల్లికి చెందిన రాజు, కాటేదాన్‌కు చెందిన అనిల్‌లు అక్రమంగా సిలిండర్లను నిల్వచేసి అవసరమైన వారికి రెట్టింపు ధరలో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, వారి వద్ద నుంచి వివిధ పరిమాణాలకు సంబంధించిన 34 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

## రోడ్లపై ‘బైక్ స్టంట్లు’

**ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**రాజేంద్రనగర్:** ద్విచక్ర వాహనాలతో రోడ్లపై స్టంట్లు చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఇద్దరు యువకులతో పాటు మరో మైనర్‌ను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకొని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన అహ్మద్ బిన్ ఫారూఖ్, అతని స్నేహితుడు మహ్మద్ ఆజంలు రెండు ద్విచక్ర వాహనాలపై మరో స్నేహితుడు మైనర్ బాలుడు (16)తో కలిసి గురువారం ఉదయం అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ వైపు ప్రయాణిస్తున్నారు. రెండు బైక్‌లపై స్టంట్లు చేస్తూ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపారు. దీంతో రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు వాహనదారులు తమ సెల్‌ఫోన్‌లో ఈ విన్యాసాలను చిత్రీకరించి సోషల్ మీడియాతోపాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు పంపిచారు. వాహనాల నంబర్ల ఆధారంగా ఇద్దరు యువకులతో పాటు మైనర్‌ను గుర్తించి పోలీసులు సాయంత్రం వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ముగ్గురిని తదుపరి విచారణ నిమిత్తం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజులు మాట్లాడుతూ..ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తే వారికి శిక్ష తప్పదన్నారు. మైనర్లకు వాహనాలు అందించిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి


రాములునాయక్ (ఫైల్)

**కొందుర్గు:** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని వెంకిర్యాలలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మానాయక్ తండాకు చెందిన రాములునాయక్(60) వెంకిర్యాలలో కూరగాయలు తెస్తానని మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం కనిపించలేదు. గురువారం ఉదయం వెంకిర్యాల శివారులోని తిమ్మారెడ్డి చెరువులో నీటిపై ఓ మృతదేహం తేలిందని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా రాములునాయక్‌గా గుర్తించారు. మృతుడి భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

## ప్రాణం తీసిన అనుమానం


జయమ్మ (ఫైల్)

**కొందుర్గు:** భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమెను బలంగా తోయడంతో తల గోడకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన గురువారం మండల పరిధిలోని రేగడిచిల్కమర్రిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోవూరు వెంకట్‌రెడ్డి, జయమ్మ(50) దంపతులకు వైష్ణవి, విష్ణువర్ధన్‌రెడ్డి ఇద్దరు సంతానం. జయమ్మ కొంతకాలంగా మరో వ్యక్తితో చనువుగా ఉంటోందని అనుమానం పెంచుకున్న వెంకట్‌రెడ్డి తరచూ ఆమెతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన వెంకట్‌రెడ్డి భార్యను బలంగా తోయడంతో తల గోడకు తగిలి అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి కొడుకు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ప్రైవేటు బస్సులో కీచక డ్రైవర్

- ఒంటరి బాలికపై లైంగిక వేధింపులు
- చితకబాదిన కుటుంబీకులు
- హైదరాబాద్ టు బెంగళూరు బస్సులో ఘటన

**శివాజీనగర (బెంగళూరు):** బస్సులో ఒంటరిగా ప్రయాణించిన బాలిక మీద లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక డ్రైవర్‌కు బాలిక కుటుంబీకులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున బెంగళూరులో బసవేశ్వర సర్కిల్‌లో జరిగింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రైవేటు స్లీపర్ బస్సు బయల్దేరింది. అందులో ఓ బాలిక (15) బెంగళూరుకు వస్తోంది. మొబైల్‌ఫోన్ చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ చేయాలని డ్రైవర్‌ను కోరింది. కొంతసేపటి తరువాత బాలిక మొబైల్ ఇవ్వాలని అడిగితే, ముద్దివ్వాలని డ్రైవర్ ఆరిఫ్ (41) బాలికను ఒత్తిడి చేశాడు. తరువాత బాలిక తన సీటు వద్దకు వెళ్లి నిద్రపోయింది. డ్రైవర్ బాలిక వద్దకు వెళ్లి తరచూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇది తట్టుకోలేక బాలిక తల్లికి ఫోన్ చేసి చెప్పింది. బస్సు సిటీకి రాగానే బాలిక తల్లి, సోదరుడు బస్సు నిలిపి డ్రైవర్ ఆరిఫ్‌ను ప్రశ్నించారు. డ్రైవర్ తప్పయిపోయిందంటూ చేతులెత్తి మొక్కి వేడుకున్నాడు. బాలిక కుటుంబీకులు అతన్ని చితక బాదారు. ఇంతలో పోలీసులు చేరుకొని డ్రైవర్‌ని అరెస్ట్ చేశారు.

# వర్షాలు కురిసి.. జలాలు పెరిగి


అమ్డాపూర్ సమీపంలో ఈసీ వాగు ప్రవాహం

- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- పరిసరాల్లో వృద్ధి చెందిన భూగర్భ జలాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


నిండుకుండలా పటేల్‌కుంట

**మొయినాబాద్‌రూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాల నిల్వలు పెరిగాయని నిపుణులు, అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటల సాగుకు అవసరమైన నీటి వనరులు సమకూరాయని భావిస్తున్నారు. బోరు బావులు సైతం సమృద్ధిగా నీటిని పోస్తున్నాయి. ఎక్కడ బోరు వేసినా పైపైనే నీరు వచ్చే అవకాశం ఉందని తెలుపుతున్నారు.

**రికార్డుస్థాయిలో వర్షాలు**

సగటు వర్షపాతం 400 మిల్లీమీటర్లు కాగా ఆగస్టు చివరి నాటికి 612 మి.మీ నమోదయింది. చేవెళ్ల నియోజకవర్గంలో వర్షపాతం నమోదు ఇలా ఉన్నది. చేవెళ్ల మండలంలో 63 శాతం, మొయినాబాద్‌లో 53 శాతం, షాబాద్‌లో 83, శంకర్‌పల్లిలో 48 శాతం అధిక వర్షం కురిసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవలేదు. జూలై రెండోవారం వరకు అడపాదడపా మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. ఆగస్టు నెలలో సమృద్ధిగా వానలు పడడంతో అధిక వర్షపాతం నమోదైంది. రానున్న రబీ సీజన్‌కు నీటి కొరత ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

**పైపైకి గంగమ్మ**

వర్షాలు సమృద్ధిగా కురిసిన నేపథ్యంలో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు పైకి వచ్చేశాయి. గతంలో పాతాళానికి పడిపోయిన నీరు ప్రస్తుతం పైపైకి పాకుతుంది. ఆగస్టు నెలలోనే 4.31 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ వాటర్ వృద్ధి చెందాయి. వేసవితో పోలిస్తే చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా మండలాలలో మొయినాబాద్‌లో 5.06, చేవెళ్లలో 7.98, షాబాద్‌లో 6, శంకర్‌పల్లిలో 4.08 మీటర్ల నీటి మట్టం పెరిగాయి.

### సమృద్ధిగా జలాలు



ఆగస్టు నెలలో అధిక వర్షాలు కురియడంతో సమీప వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు సమృద్ధిగా పోస్తున్నాయి. ఈ సంవత్సరం పంటలకు నీటి కొరత ఉండదు.

– సైపాల్‌రెడ్డి, రైతు, అమ్డాపూర్

### పెరిగిన సాగు విస్తీర్ణం



సమృద్ధిగా వర్షాలు కురవడంతో వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. బోరు బావుల్లో జలాలు పెరిగాయి. వాగులు, వంకలు అలుగు పారుతున్నాయి. పత్తి, కంది ఇతర కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– అనురాధ, ఏఓ, మొయినాబాద్

# ‘జూబ్లీహిల్స్ లయన్స్’ సేవలు భేష్



మాదాపూర్ స్కూల్‌లో ఐరన్ షెడ్‌ను ప్రారంభించిన జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సభ్యులు

- మాదాపూర్ స్కూల్‌లో ఐరన్ షెడ్ ఏర్పాటు
- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**మాదాపూర్:** విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సేవాతత్పరతను చాటుకుంది. ఈ మేరకు మాదాపూర్‌లోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల కోసం ఐరన్ షెడ్ నిర్మించారు. శనివారం ఈ షెడ్‌ను లయన్స్ జిల్లా గవర్నర్ 320డి లయన్ అమర్‌నాథ్‌రావు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి లయన్ గిరిజారెడ్డి, డాక్టర్ పి.సీత, జయశ్రీ మూర్తి, జ్వాలా వైష్ణవి, మండవ శిల్ప విరాళాలు అందించారు. విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మించిన ఈ షెడ్..విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ చూపుతున్న అంకితభావానికి నిదర్శనమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు లయన్ కోనేరు రామసుందరి, కార్యదర్శి లయన్ రిందా దేవి, హెడ్మాస్టర్ మోహన్‌రావు, నరసింహరాజు, రామమోహన్, సౌభాగ్య, మర్రి ప్రవీణ్, ఈవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అవగాహన**

మాదాపూర్‌లోని మండల ప్రాథమిక పరిషత్ స్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్ నాగరాజు, నరసింహరాజు, పద్మావతి త్రిపురనేనిలు మానసిక ఆరోగ్యంపై మార్గనిర్దేశం చేయగా, తెలంగాణ పోలీస్ ట్రెనింగ్ సెంటర్, అంబర్‌పేట్ నిపుణులు విద్యార్థులకు సైబర్‌క్రైమ్స్, డ్రగ్స్ దుష్పలితాలపై అవగాహన కల్పించారు. ఫోరెన్సిక్, కెరీర్ ప్రోగ్రెస్‌పై సుస్మిత, సైబర్ ముప్పు, హ్యాకింగ్‌పై రాహుల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ క్లబ్ అధ్యక్షుడు కోనేరు రామ సుందరి, హెడ్మాస్టర్ బసవలిగం తదితరులు పాల్గొన్నారు.

## 108 సిబ్బందికి అవార్డులు



ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న డీజీ సౌమ్యమిశ్ర

**మొయినాబాద్:** తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ఆల్ ఇండియా ప్రిసన్ డ్యూటీ మీట్‌లో ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బంది అవార్డులు అందుకున్నారు. నాలుగు రోజులపాటు జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిసన్ డ్యూటీ మీట్ 2025లో దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల్లో గాయపడినవారికి చికిత్స అందించడం, ఆసుపత్రికి తరలించడంలో మొయినాబాద్ 108 సిబ్బంది ఈఎంటీ భూక్య శ్రీకాంత్, పైలెట్ గవ్వల చంద్రశేఖర్ ఉత్తమ సేవలు అందించారు. వారి సేవలను గుర్తించిన ప్రిసన్ డీజీ సౌమ్యమిశ్ర గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో అవార్డులు అందజేసి అభినందించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో వృద్ధుడి మృతి


ఖాజా మొయినుద్దీన్ (ఫైల్)

**నాగోలు:** ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ (70) నాగోలు బండ్లగూడలో పండ్లు అమ్ముతూ జీవనం సాగించేవారు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పని ముగించుకొని భారత్ పెట్రోల్ పంప్ ఎదుట రోడ్డు పక్కన టీ తాగి తన బైక్ వైపు వెళ్తుండగా నాగోలు నుండి బండ్లగూడ వైపు వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఖాజా మొయినుద్దీన్‌ను చికిత్స కోసం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బైకును ఢీకొట్టిన కారు: యువకుడి దుర్మరణం


సందీప్ (ఫైల్)

**చైతన్యపురి:** వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు..ఓ బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం పాలు కాగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన గుడాల సందీప్ (28) ఎల్‌బీనగర్‌లోని బర్గర్ కింగ్‌లో పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున సందీప్ తన స్నేహితుడు గంజ పవన్ కుమార్ (21)తో కలిసి పల్సర్ బైక్‌పై ఎల్‌బీనగర్ వెళ్తున్నాడు. వీఎంహోం మెట్రో స్టేషన్ సమీపంలోకి రాగానే దిల్‌సుఖ్‌నగర్ నుంచి వేగంగా వచ్చిన కారు వీరి బైకును వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సందీప్, పవన్‌లు ఎగిరి రహదారిపై దూరంగా పడ్డారు. పవన్ కాలు శరీరం నుంచి వేరు పడి పోయింది. స్థానికుల సమాచారం మేరకు గాయపడ్డ ఇద్దరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ సాయంత్రం మృతి చెందాడు. పవన్ చికిత్స పొందుతున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కారు డ్రైవర్ హయత్‌నగర్‌కు చెందిన నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

**యాచారం:** ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో యాచారం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో ఈ నెల 6న అర్ధరాత్రి ఓ బాలికను కిడ్నాప్ చేసి అదే గ్రామానికి చెందిన భాషమోని క్రాంతి, జి.క్రాంతిలు లైంగికదాడికి పాల్పడ్డారు. దీనిపై యాచారం పోలీసులు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

## మేకల దొంగల హల్‌చల్

**కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో వరుస చోరీలు**

**కొందుర్గు:** గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వ్యవసాయ పొలాల వద్ద ఉన్న మేకలు, గొర్రెలు ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో దొంగలు మేకలను ఎత్తుకెళ్లారు. సోమవారం పెద్దఎల్కిచర్ల గ్రామానికి చెందిన వెంకటయ్య 30 మేకలు ఎత్తుకెళ్లగా మంగళవారం జిల్లేడ్ గ్రామానికి చెందిన శాంతయ్యకు సంబంధించిన 40 మేకలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జిల్లేడ్ చౌదరిగూడ ఎస్‌ఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా ఆగస్టు 5న కొందుర్గు మండలం తంగెళ్లపల్లికి చెందిన చంద్రయ్యకు సంబంధించి 8 మేకలు ఎత్తుకెళ్లారు. అదే నెల 29న వెంకిర్యాలకు చెందిన యాదయ్య 8 గొర్రెలు, ఒక మేకను దొంగిలించారు.

**జాగ్రత్తలు తీసుకోవాలి**

రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పంట పొలాల వద్ద పాకలో ఉంచితే దొంగతనం చేయడానికి సులభంగా మారిందని కొందుర్గు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అన్నారు. సాధ్యమైనంత వరకు పశువుల పాకలకు తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు బిగించుకోవాలని చెప్పారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**షాద్‌నగర్‌రూరల్:** పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలోని అయ్యప్పకాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఇందులో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.64 లక్షలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## జింక కొమ్ముల విక్రయానికి యత్నం

**నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్**

**సాక్షి, సిటీబ్యూరో:** అరుదైన యాంటిలోప్ సెర్వికాప్రా జాతికి చెందిన జింక కొమ్ములు విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడి నుంచి రెండు కొమ్ములు స్వాధీనం చేసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన మహ్మద్ ఖలీముద్దీన్ అలియాస్ సలీం వృత్తిరీత్యా తాపీమేస్త్రీ. బతుకుతెరువు కోసం నగరానికి వలసవచ్చిన ఇతగాడు షహీన్‌నగర్‌లో ఓ పాన్ షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో సదాశివపేటకు రాకపోకలు సాగిస్తూ మేస్త్రీ పని కూడా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అక్కడ ఓ ఇంటి కూల్చివేత పనులు చేస్తుండగా ఇతడికి జింక కొమ్ములు దొరికాయి. వీటిని సొంతం చేసుకుని సలీం నల్లరంగు కవర్‌లో చుట్టి నగరానికి తీసుకువచ్చాడు. తొలినాళ్లల్లో ఆ కొమ్ముల నుంచి చిన్న ముక్కలు వేరుచేసి పొడి చేసేవాడు. దీన్ని వినియోగిస్తే ఎముకలు పటిష్టం కావడంతో పాటు కొన్ని రోగాలు తగ్గుతామని నమ్మబలికి విక్రయించే వాడు. ఇటీవల రెండు కొమ్ములనీ విక్రయించాలని భావించిన సలీం ఖరీదు చేసే వ్యక్తుల కోసం వెతుకుతున్నాడు. దీనిపై తూర్పు మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. సీఐ నాగార్జున నేతృత్వంలో ఎస్సైలు అనంతాచారి, కరుణాకర్‌రెడ్డి తమ బృందాలతో వలపన్ని సలీంను పట్టుకున్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**మంత్రి కొండా సురేఖ**


సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

**బహదూర్‌పురా:** అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఇకపై ప్రతిభావంతులైన ఫ్రంట్‌లైన్ అధికారులకు ఏటా రూ.10 వేలు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు వృథా కానివ్వమన్నారు. గురువారం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కు ఆవరణలోని అమరవీరుల విగ్రహం వద్ద నిర్వహించిన జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ డాక్టర్ జితేందర్, రాష్ట్ర అటవీ ప్రధాన అధికారిణి డాక్టర్ సువర్ణలతో కలసి పాల్గొన్నారు. స్మారక చిహ్నం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. 1984 సంవత్సరం నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో విధి నిర్వహణలో 22 మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పచ్చదనం పెంపులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ‘వన మహోత్సవం’ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద మానవ ప్రయత్నమన్నారు. వనమహోత్సవం ద్వారా మన రాష్ట్రంలో 307.48 కోట్లకు పైగా మొక్కలను ఇప్పటికే నాటడం జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ అడవులను కాపాడుతున్న అటవీ అధికారుల కృషి అభినందనీయమన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేనిచోట, దట్టమైన అడవుల్లో వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అడవులను కాపాడుతున్నారన్నారని, విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారులు, సిబ్బంది త్యాగాలను స్మరించుకోవాలన్నారు. డీజీపీ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ..అడవులను కాపాడేందుకు అధికారులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాటిని కాపాడటమే అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి డాక్టర్ సువర్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు, పీసీపీఎఫ్ జొహరి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, అడిషనల్ పీసీపీఎఫ్‌లు సి.శరవనన్, , ప్రియాంక వర్గీస్, జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్, క్యురేటర్ జె.వసంత, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ క్షితిజ, డాక్టర్ జి. రామలింగం, జీహెచ్‌ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ సుభద్రాదేవి, జూపార్క్ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డా.ఎం.ఎ. హకీమ్, డిప్యూటీ క్యురేటర్ బర్నోబా, అసిస్టెంట్ డైరెక్టర్ (వెట్) శ్రీనివాస్ , మాజీ క్యూరేటర్లు ఎ.శంకరన్, రాజశేఖర్, మాజీ డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, అసిస్టెంట్ క్యురేటర్లు నాజియా తబుసుమ్, ఎస్.లక్ష్మణ్, ఈపీఆర్‌ఓ హనీఫుల్లా, జూ సిబ్బంది పాల్గొన్నారు.